సాక్షి
అన్నమయ్య జిల్లా
బుధవారం । 6 । నవంబర్ । 2024



పేదల ఆశలను కూల్చేశారు!

కురబలకోట మండలం విశ్వం కళాశాల సమీపంలో 28 సెంట్ల ప్రభుత్వ స్థలంలో 11 మంది పేదలు నిర్మించుకున్న కట్టడాలను రెవెన్యూ అధికారులు కూల్చేశారు. -8లో



పవన్ వ్యాఖ్యలు ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనం

డిప్యూటీ సీఎం పవన్ హోంశాఖపై చేసిన వ్యాఖ్యలు ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని మాజీ ఎమ్మెల్యే కొరముట్ల అన్నారు. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.300	రూ.360
రెండోరకం	రూ.200	రూ.290



మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 293 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	320	550
సీబీ	-	-



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 502.580 కిలోలు

న్యూస్‌రీల్

స్కిల్ హబ్‌ను సద్వినియోగం చేసుకోండి

రాయచోటి టౌన్: రాయచోటిలోని పాలిటెక్నికల్ కళాశాలలో నిర్వహించే స్కిల్ హబ్‌ను సద్విని యోగం చేసుకోవాలని ప్రిన్సిపల్ శివశంకర్, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి దాసరి నాగార్జున మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఏపీ స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, ప్రధాన మంత్రి కౌశల్ వికాస్ యోజన వారి ఆధ్వర్యంలో ఈ స్కిల్ హబ్ సెంటర్ నిర్వహిస్తున్నట్లు వారు పేర్కొన్నారు. జిల్లాలో ఉన్న వనరులు, డిమాం డ్‌ను దృష్టిలో ఉంచుకొని.. యువతకు డిమాండ్ ఉన్న కోర్సుల ద్వారా మూడు నెలలు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి స్థానికంగా ఉన్న పరిశ్రమలలో ఉపాధి కూడా కల్పించనున్నట్లు పేర్కొన్నారు. ఈ శిక్షణ తరగతులు ఈ నెల రెండవ వారం నుంచి ప్రారం భిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం ఉన్న కోర్సులలో హౌస్ వైరింగ్ (అసిస్టెంట్ ఎలక్ట్రీషియన్) కోసం దరఖాస్తు చేసుకోవాలని కోరారు. 10వ తరగతి పాస్/ఐటీఐ/ డిప్లమా ఆపై చదివిన వారు అర్హు లన్నారు. ఈ కోర్సు పురుషులకు మాత్రమేనని తెలిపారు. మరిన్ని వివరాల కోసం నంబర్ : 9550010426 0కు ఫోన్ చేయాలని కోరారు.

నియామకం



మనోహర్

రాయచోటి (జగదాంబ సెంటర్): జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడిగా రాయచోటి మండలం యండపల్లి గ్రామం ఎగువ దళితవాడకు చెం దిన బండకింద మనోహర్‌ను నియమించారు. జిల్లాలో అభివృద్ధి కార్యక్రమాలతోపాటు సమ స్యల పరిష్కారంలో ఈ కమిటీ ప్రత్యేకంగా వ్యవ హరించనుంది. జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో ఏర్పా టైన ఈ కమిటీలో 11 మంది సభ్యులు ఉన్నారు. అందులో రాయచోటి నియోజకవర్గ పరిధిలోని రాయచోటి మండలం నుంచి బండకింద మనోహర్, రామాపురం మండలం చిట్లూరుకు చెందిన వెంకటరమణ, లక్కిరెడ్డిపల్లెకు చెందిన రాజశేఖర్‌ను సభ్యులుగా నియమించారు. మనో హర్ గతంలో ఎంఆర్‌పీఎస్ అన్నమయ్య జిల్లా కన్వీనర్‌గా, టీడీపీ ఉమ్మడి వైఎస్‌ఆర్ జిల్లా కార్య వర్గ సభ్యులుగా, టీడీపీ ఎస్సీ సెల్ వైఎస్‌ఆర్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా పని చేశారు.

పంటల బీమా రైతులే చెల్లించాలి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి చంద్రానాయక్

గుర్రంకొండ: రబీ సీజన్‌లో పంటలు సాగు చేసుకునే రైతులు బీమా ప్రీమియం డబ్బులు చెల్లించాలని జిల్లా వ్యవసాయాధికారి చంద్రా నాయక్ తెలిపారు. స్థానిక రైతు భరోసా కేం ద్రంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024-25 ఏడాదికి గాను పంటలు సాగు చేసుకొనే రైతులందరూ పంటల బీమా చేయించుకోవాలన్నారు. కాక పోతే పంటల బీమా మొత్తాన్ని రైతులు భరిం చాల్సి ఉంటుందన్నారు. పంట రుణం పొం దిన రైతులైతే.. ఆ రుణంలో నుంచే ప్రీమియం చెల్లించుకోవచ్చన్నారు. పంట రుణం తీసుకోని రైతులు కామన్ సర్వీస్ సెంటర్, మీసేవా, గ్రామ సచివాలయాల్లో దరఖాస్తు చేసుకొని ప్రీమియం చెల్లించాలన్నారు. రబీ సీజన్‌లో వరి, వేరుశనగ, టమాట పంటలను బీమా కోసం ప్రభుత్వం గుర్తించిందన్నారు. ఈ కార్య క్రమంలో ఏవో నాగరత్నమ్మ, ఎంపీఈవో నవాజ్, రైతులు పాల్గొన్నారు.

టమాటకు క్రాప్ ఇన్సూరెన్స్ వినియోగించుకోవాలి



మాట్లాడుతున్న జిల్లా ఉద్యాన అధికారి రవిచంద్రబాబు

కురబలకోట: టమాట పంటకు వాతావరణ ఆధా రిత పంటల బీమాను రైతులు వినియోగించుకో వాలని జిల్లా ఉద్యాన శాఖ అధికారి రవిచం ద్రబాబు కోరారు. మంగళవారం మదనపల్లె డివిజన్‌లోని ఉద్యాన, వ్యవసాయ సహాయకు లతో అంగళ్లలో జరిగిన అవగాహన సమావేశం లో ఆయన మాట్లాడారు. ఉద్యాన పంటలలో టమాట జిల్లాలో రెండో స్థానంలో ఉందన్నారు. అక్టోబరు 15 నుంచి డిసెంబరు 15 వరకు నాటే టమాటకు వాతావరణ పరిస్థితుల మార్పుల వల్ల.. పంట నష్టం జరిగితే రైతులకు క్రాప్ ఇన్సూ రెన్సు ద్వారా ఆదుకోవడం జరుగుతుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో రబీ సీజ న్‌లో వాతావరణ ఆధారిత పంటల బీమా పథకం వర్తిస్తుందన్నారు. రైతులు ఎకరాకు రూ.1600 చొప్పున ప్రీమియం చెల్లిస్తే రూ.32 వేల పంట నష్ట పరిహార బీమా పొందవచ్చన్నారు. రైతు సేవా కేంద్రాల్లో సంప్రదించాలని వివరించారు.

కొందరికే ఉచితం!

- చాలా మందికి అందని గ్యాస్
- ఎన్నికల ముందు అందరికీ అంటూ హామీ
- అనర్హుల ఏరివేత పేరుతో శఠగోపం
- అంతా 'బండ' మోసం
- కూటమి ప్రభుత్వంపై మండిపడుతున్న జనం



సాక్షి రాయచోటి: సార్వత్రిక ఎన్నికలకు ముందు బాబు మాటలకు.. అధికారంలోకి వచ్చిన తర్వాత హామీల అమలు చూస్తే పొంతన దొరకడం లేదు. ఇప్పటికే కూటమి సర్కారు పగ్గాలు చేపట్టి ఐదు నెలలు అవుతున్నా.. ఇంత వరకు సూపర్ సిక్స్ పూర్తి స్థాయిలో అమలు చేయని పరిస్థితులు కళ్లె దుటే కనిపిస్తున్నాయి. మరోపక్క ప్రతి కుటుంబా నికి ఏడాదికి మూడు సిలిండర్లు ఉచితంగా ఇస్తామని ఎన్నికలకు ముందు పేర్కొన్నా అది అం దరికీ కాదు.. కొందరికే అని తేలిపోయింది. ఎన్నిక లకు ముందు చెప్పేదొకటి.. అధికారంలోకి వచ్చిన తర్వాత చేసేది మరొకటిగా మారింది. అందరికీ గ్యాస్ అన్న నినాదం ప్రస్తుతం ఊరడింపుగా మారుతోంది. రేషన్‌కార్డు దారుల లెక్కచూసినా, గ్యాస్ వినియోగదారుల సంఖ్య చూసినా లక్షల సం ఖ్యలో ఉండగా.. అందులో మూడొంతులు మాత్రమే ఇస్తుండగా, మిగిలిన వారికి శఠగోపం పెడుతున్నారు. అధికారంలోకి రావడం కోసం

జిల్లాలో ఉచిత గ్యాస్‌కు అర్హులు:	3,74,252
మొత్తం గ్యాస్ ఏజెన్సీలు:	34
వాటి పరిధిలోని కనెక్షన్లు:	5,11,734
ఉచిత గ్యాస్ అందని వారు:	1,37,482
తెల్లరేషన్ కార్డులు:	5,04,425

శ్రేణులంతా ఆహో, ఓహో అంటూ అందరికీ ఉచిత గ్యాస్ అని ప్రచారం చేసినా.. పెద్ద ఎత్తున వినియో గదారులకు 'గ్యాస్' మాటలుగా మిగిలిపోతోంది.

ఇదీ లెక్కా!

అన్నమయ్య జిల్లాలో గ్యాస్ వినియోగదారులకు సంబంధించి సుమారు 5,11,734 మంది ఉన్నారు. ఒకవేళ రేషన్‌కార్డుల లెక్క తీసుకున్నా దాదాపు 5,04,425 కార్డులు ఉన్నాయి. అయితే ప్రభుత్వం రేషన్‌కార్డుల ఆధారంగా పేద వర్గాలకు అన్నప్పటికీ వారందరికీ కూడా ఉచిత గ్యాస్‌ను వర్తింపజేయ లేదు. ఈకైవేసీ అని, ఇతర నిబంధనలతో సుమారు 1.37 లక్షల మందికి పైగా వినియోగదారులకు ఉచిత గ్యాస్ అందని పరిస్థితి నెలకొంది. కూటమి సర్కారు ఎలాంటి లెక్కలు వేసిందో తెలియదు గానీ ఉచిత గ్యాస్ మాత్రం లక్షలాది మందికి దూరం అయింది.

అందరికీ కాదు..

దీపం పథకంతోపాటు కేంద్ర ప్రభుత్వ ఉజ్వల స్కీమ్ పథకం కలుపుకొని సుమారు 5,11,634 వరకు కనెక్షన్లు ఉన్నాయి. అంతేకాకుండా జిల్లా వ్యాప్తంగా 34 గ్యాస్ ఏజెన్సీల పరిధిలోని వినియో గదారులందరికీ ఉచిత గ్యాస్ ఒట్టిదేనని తేలింది. ప్రస్తుతం కూటమి సర్కార్ దీపం-2 కింద అందిం చే ఉచిత గ్యాస్.. వినియోగదారుల్లో చాలా మందికి అందడం లేదు. ఉచిత గ్యాస్ అందిరికీ కాదు.. కొం దరికే అని తేలిపోయింది.

వినియోగదారుల్లో ఆగ్రహం



జిల్లాలో సుమారు 1.30 లక్షలకు పైగా ఉచిత గ్యాస్ అందని వినియోగదారులు కనిపిస్తు న్నారు. అటు రేషన్‌కార్డులతో పోల్చినా, ఇటు గ్యాస్ కనెక్షన్లను పరిశీలించినా అన్ని విధా లుగా అర్హులైనా.. చిన్న చిన్న కారణాలు చెబుతూ పథకాన్ని వర్తించడం లేదని స్పష్టం గా తెలుస్తోంది. అయితే కూటమి సర్కారు అందరికీ అంటూ ఈ విధంగా చేయడంతో పలు వర్గాలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తు న్నాయి. దీపం-2 కింద ఉచిత గ్యాస్ చాలా మంది వినియోగదారులకు వర్తించకపోవడం పై ప్రతిపక్ష పార్టీతోపాటు అన్ని పార్టీల్లోనూ తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది.



ఎన్నికల మేనిఫెస్టోలో కూటమి ప్రకటించిన సూపర్‌సిక్స్‌లో సిలిండర్ల హామీ ఫొటో

హామీ నిలబెట్టుకోవాలి



జిల్లా వ్యాప్తంగా అర్హులందరికీ ఉచిత సిలిండర్‌లు అందజేయాలి. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు పేద లకు, మధ్యతరగతి కుటుంబాలకు ఉచిత సిలిండర్లను అందజేసి, వారికి తోడుగా ఉం డాలి. అర్హులైన వారికి సిలిండర్లు అందించడాన్ని కూటమి ప్రభుత్వం బాధ్యతగా భావించాలి. ఎన్నికలలో ఇచ్చిన హామీని అమలు చేసేలా సత్వర చర్యలు చేపట్టాలి. చంద్రబాబుకు హామీలు ఇవ్వడం, నెరవేర్చకుండా ప్రజలను మోసం చేయడం పరిపాటిగా మారింది. – ఆకేపాటి అమర్‌నాథరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, రాజంపేట ఎమ్మెల్యే

అర్హులందరికీ అందించకపోతే ఆందోళన



కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలలో భాగంగా ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీలో అర్హత ఉన్న అందరికీ అందజే యకపోతే ఆందోళనలు చేస్తాం. ఎన్నికలలో ఇచ్చిన హామీ మేరకు అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి ఈ పథకాన్ని వర్తింపజేయాలి. గతంలో చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఉన్న సమయం లో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజల కోపానికి గురయ్యారు. తిరిగి హామీల అమలు విషయంలో ప్రజలను మోసగించే ప్రయత్నానికి కూటమి ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోంది. జిల్లాలో ఐదు లక్షల మందికిపైగా రేషన్ కార్డు దారులు ఉంటే మూడు లక్షల మంది వరకు మాత్రమే గ్యాస్ పథకానికి అర్హులని అధికారులు ప్రకటించడం దారుణం. – బుక్కే విశ్వనాథనాయక్, ఏపీ సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, రాయచోటి

9న వలంటీర్ల ఆవేదన సదస్సు



మాట్లాడుతున్న వలంటీర్ల అసోసియేషన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు మహేష్

రాజంపేట రూరల్: వలంటీర్ల ఆవేదన సద స్సును ఈ నెల 9న విజయవాడలో నిర్వహించ నున్నట్లు వలంటీర్ల అసోసియేషన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు పీ మహేష్, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ఎం.శివరాకృష్ణదేవర తెలి యజేశారు. స్థానిక ఏఐటీయూసీ కార్యాలయం లో మంగళవారం వలంటీర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వలం టీర్ల వ్యవస్థను ఏర్పాటు చేసి రూ.5 వేలు నెలకు గౌరవ వేతనం ఇచ్చేదని గుర్తుచేసుకు న్నారు. ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం వలంటీర్ వ్యవస్థను కొనసాగి స్తామని ప్రతి చోట హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. అదే విధంగా ఉద్యోగ భద్రత కల్పిస్తూ వలంటీర్‌లకు గౌరవవేతనం రూ.10 వేలు అం దజేస్తామని హామీ ఇచ్చిందని పేర్కొన్నారు. అయితే కూటమి ప్రభుత్వం ఏర్పాటు అయిన 5 నెలల కాలంలో 8 పర్యాయాలు నిర్వహిం చిన క్యాబినెట్ మీటింగ్‌లలో వలంటీర్ వ్యవ స్థపై కనీసం చర్చించక పోవటం దారుణమ న్నారు. ఎన్నికల వాగ్దానాన్ని కూటమి ప్రభుత్వం నెరవేర్చటంతోపాటు వారికి గత 5 నెలల జీతం ఇవ్వాలని డిమాండ్ చేశారు. వలంటీర్‌లకు పార్టీలు ఆపాదించకుండా నిరుద్యోగులుగా గుర్తించాలని కోరారు. విజ యవాడలో నిర్వహించే ఈ ఆవేదన సదస్సులో ప్రతి ఒక్క వలంటీర్ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఏపీ మహిళా సమాఖ్య జిల్లా నాయకురాలు సరోజ నమ్మ, వలంటీర్ల అసోసియేషన్ నాయకులు సాయికృష్ణ, మీనాప్రసాద్, గురుమూర్తి, శివ, రాజేష్, రెడ్డెయ్య తదితరులు పాల్గొన్నారు.

12 నుంచి వీరబ్రహ్మేంద్రస్వామి జయంత్యుత్సవాలు



బ్రహ్మంగారిమఠం: కాలజ్ఞాన ప్రబోధకర్త శ్రీ పోతు లూరు వీరబ్రహ్మేంద్ర స్వామి 416వ జయం త్యుత్సవాలు 12నుంచి 14వరకు ఘనంగా జరపను న్నట్లు మఠం పిట్‌పర్సన్ శంకర్‌బాలాజీ తెలిపారు. మంగళవారం బి.మఠంలో ఆయన మట్లాడుతూ బ్రహ్మంగారి జయంతి ఉత్సవాలను ఈనెల 12 మంగ ళవారం నుంచి ప్రారంభం అవుతాయన్నారు. 13 బుధవారం బ్రహ్మంగారు జయంతి సందర్భంగా ప్రత్యేక పూజలు, కార్యక్రమాలు ఉంటాయన్నారు. 14 గురువారం భజనలు, ప్రతేక పూజలు ఉంటాయ న్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించాలన్నారు.

రాయవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తనిఖీ



ఆశావర్కర్లకు సూచనలు ఇస్తున్న డీఎంహెచ్‌ఓ కొండయ్య

సుండుపల్లె: మండల పరిధిలోని రాయవరం ప్రాథ మిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కొండయ్య మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన ఆశా డే కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం మాట్లా డుతూ పూర్తి స్థాయిలో గర్భిణులను నమోదు చేసి, వ్యాధి నిరోధక టీకాలు వేయాలని ఆశావర్కర్లకు సూచించారు. ఈ నెల 14 నుంచి అన్ని పాఠశాలలు, అంగన్‌వాడీ సెంటర్లలోని పిల్లలను పరిశీలించి క్యాన్సర్, టీబీ, లెప్రసీకి సంబంధించి సర్వే చేసి, ఆ వ్యాధిగ్రస్తులను గుర్తించి వైద్య పరీక్షలకు రెఫర్ చేయాలని తెలియజేశారు. అనంతరం పీహెచ్‌సీలోని పలు రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌ఓ నారాయణ, డాక్టర్ శేఖర్‌రెడ్డి, రుబీనా, ఎం పీహెచ్‌ఓ వీరనారాయణ, సూపర్ వైజర్లు, ఏఎన్‌ఎం లు, ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

వైజ్ఞానిక ప్రదర్శనలతో ప్రతిభ మెరుగు

జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి



చిన్నారులు ఏర్పాటు చేసిన నమూనాలు పరిశీలిస్తున్న కలెక్టర్ శ్రీధర్ చామకూరి

తంబళ్లపల్లె: అంగన్‌వాడీ కేంద్రాల్లో వైజ్ఞానిక ప్రదర్శ నతో పిల్లల్లో అభ్యసన నైపుణ్యం, విజ్ఞానం పెరుగు తాయని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి తెలిపారు. తంబళ్లపల్లె ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో పిల్లలతో ఏర్పాటు చేసిన ప్రీస్కూల్ సైన్స్‌ఎక్స్‌పో వైజ్ఞానిక ప్రదర్శనను మంగళవారం ప్రారంభించారు. పిల్లలు బాడీపార్ట్స్, నా కుటుంబం, పరిసరాలు, హెల్పింగ్ పీపుల్, ఆకారాలు, రంగులు, జంతువులు, పూలు, వాహనాలు, జెర్మినేషన్ ప్రాసెస్, చేతుల పరిశుభ్రత తదితర 30 అంశాలతో నమూనాలు ఏర్పాటు చేశారు. పిల్లలు తాము ప్రదర్శించిన అం శాల గురించి కలెక్టర్‌కు ఉత్సాహంగా వివరించారు. పిల్లలతో మమేకమై వారి అభిరుచులను తెలుసుకు న్నారు. పిల్లందరికీ తానే మిఠాయిలు పంచిపెట్టారు. తంబళ్లపల్లె క్లస్టర్‌లోని అంగన్‌వాడీల పనితీరు భేష్ అని కితాబు ఇచ్చారు. జిల్లాలో తంబళ్లపల్లె ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆదర్శంగా నిలిచిందని, మిగిలిన ప్రాజెక్టు లలో కూడా ఇలాగే అంగన్‌వాడీ కేంద్రాల అభివృద్ధికి కృషి చేయాలన్నారు. పిల్లల చేత క్లాసు రూములో బోర్డులపై రాయించడం, చదివించడం ఒక మంచి అభ్యసనం అవుతుందన్నారు. పలు కేంద్రాలకు గ్రీన్‌బోర్డులు, డస్టర్, చాక్‌పీసులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ రమాదేవి, తహసీల్దార్ హరికుమార్, ఎంపీడీఓ ఉపేందర్‌రెడ్డి, సీడీపీఓ నాగ వేణి, సూపర్‌వైజర్లు తదితరులు పాల్గొన్నారు.


రీ సర్వే అర్జీలు పరిష్కరించాలి

రాయచోటి (జగదాంబసెంటర్): రీసర్వే ప్రక్రియలో వచ్చిన అర్జీలను త్వరగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం వెలగపూడి సచివాలయం నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు, సంయుక్త కలెక్టర్లు, సర్వే శాఖ అధికారులతో సీసీఎల్‌ఏ జయలక్ష్మి రీ సర్వే ప్రక్రి యపై సమీక్ష సమావేశం నిర్వహించారు. రాయచోటి కలెక్టరేట్‌లోని వీసీ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి ఈ సమావేశానికి హాజరయ్యారు. ఈ సం దర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నమయ్య జిల్లాలో ఇప్పటి వరకు జరిగిన గ్రామసభలలో వచ్చిన అర్జీ లను వెంటనే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకో వాలని రెవెన్యూ, సర్వే శాఖ అధికారులను ఆదేశిం చారు. ఈ సమావేశంలో డీఆర్‌ఓ మధుసూధనరావు, ఏడీ సర్వే భరత్ తదితరులు పాల్గొన్నారు.

ఆలస్యంగా వస్తే.. అంతే!

కూటమి అధికారంలోకి వచ్చిన ఐదు నెలల్లోనే ఉద్యోగుల పట్ల రోజుకో నిబంధ నతో ఇబ్బందులు పెడుతోంది. ఈసారి వైద్యశాఖలోని ఉద్యోగులను టార్గెట్ చేసిం ది. గత నెల నుంచి హాజరు పేరుతో వేత నాల్లో కోతలు మొదలయ్యాయి. ఎన్ హెచ్‌ఎం పరిధిలో పని చేసే పలువురి జీతాల్లో కోత పడింది. దీంతో సర్కారు తీరుపై ఉద్యోగులు తల పట్టుకుంటున్నారు. తాజాగా విధులకు ఆలస్యంగా హాజరైతే జీతంలో కోత తప్పదని అధికారులు హెచ్చరించడంతో.. వారు మరింత ఆందోళ నకు గురవుతున్నారు.

- హెల్త్ మిషన్ ఉద్యోగుల జీతాల్లో కోతలు
- ఎఫ్‌ఆర్‌ఎస్ లింకుతోపాటు పలు ఆంక్షలు
- గగ్గోలు పెడుతున్న ఉద్యోగులు, సిబ్బంది



మదనపల్లె సిటీ: ఆ ఉద్యోగులకు పని కాదు.. హాజరు ముఖ్యం అట. హాజరు ఆధారంగానే జీతం ఇస్తారంట. ఎఫ్‌ఆర్‌ఎస్(ఫేసియల్ రికగ్నైజేషన్ సిస్టం) పేరుతో ఉద్యోగులకు భారీగా కోత పడుతుం ది. దీంతో ఆయా ఉద్యోగులు గగ్గోలు పెడుతున్నా అధికారులు ఆలకించడం లేదు. నేషనల్ హెల్త్‌మి షన్ పరిధిలోని జిల్లాలో పని చేస్తున్న ఉద్యోగులకు అక్టోబర్ నెల జీతంలో భారీగా కోత పడింది. ఎన్‌హె చ్‌ఎం కింద ఎంఎల్‌హెచ్‌పీలు, స్టాఫ్‌నర్సులు, మెడి కల్ ఆఫీసర్లు, ల్యాబ్‌టెక్నీషియన్లు, ఫార్మసిస్టులు, అటెండర్లు, వాచ్‌మెన్లు పని చేస్తున్నారు. కొంత మం ది ప్రతి రోజు ముఖ ఆధారిత హాజరు వేసినా.. అది డేటా బేస్‌కు వెళ్లకపోవడంతో గైర్హాజరుగా చూపిస్తు న్నట్లు చెబుతున్నారు. ఆరోగ్యశాఖలో పని చేస్తున్న అన్ని స్థాయిల్లోని ఉద్యోగులకు ఇక మీదట ఎఫ్‌ఆర్ ఎస్ ఆధారంగానే జీతాల చెల్లింపు జరుగుతుందని వైద్య, ఆరోగ్యశాఖ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. నవంబర్ నుంచే ఎఫ్‌ఆర్‌ఎస్ ఆధారంగా జీతాల చెల్లింపులు జరుగుతాయని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అక్టోబర్ నెలలోనే నేషనల్ హెల్త్ మిషన్ ఉద్యోగులకు అమలు పరిచారు. ఇప్పుడు వైద్య, ఆరోగ్య శాఖలో మిగిలిన ఉద్యోగులకు దాన్ని విస్తరించారు. ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల జీతాల్లో కోత పెడుతూ ఇబ్బందులకు గురి చేస్తోందని ఆ విభాగం లోని ఉద్యోగులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

సమయంతో ముడిపెట్టలేని ఉద్యోగం

వైద్య, ఆరోగ్య శాఖలోని క్షేత్రస్థాయి సిబ్బంది సమ యంతో పని లేకుండా ప్రజలకు అందుబాటులో ఉండాలి. ఉదాహరణకు ఓ గర్భిణి నొప్పులు పడు తుంటే అది అర్ధరాత్రి అయినా సరే ఏఎన్‌ఎం, ఆశా కార్యకర్త బాధితురాలితో కలిసి ఆస్పత్రికి వెళ్లాల్సిందే. గ్రామంలో వాంతులు, విరేచనాలు వంటి ఎపిడిమిక్ ప్రబలినప్పుడు రాత్రి వేళ కూడా విధుల్లో ఉండాలి. ఉదయం 9 నుంచి సాయంత్రం 4 వరకు డ్యూటీ సమయం అని అనడానికి వీలు లేదు. ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండా ల్సిన సిబ్బందిని కూడా ఎఫ్‌ఆర్‌ఎస్ చట్రంలో బిగించి.. జీతాల కోత అనడం వైద్య ఆరోగ్యశా ఖలో నిరసనకు కారణంగా అవుతోంది.

జిల్లాలో పీహెచ్‌సీలు :	49
విలేజ్ హెల్త్ క్లినిక్‌లు :	375
అర్బన్ హెల్త్ సెంటర్లు :	11
జిల్లా ఆస్పత్రి :	1
ఏరియా ఆస్పత్రులు :	2
సీహెచ్‌సీలు :	7

గత ప్రభుత్వంలో ఇలా...

జిల్లా వ్యాప్తంగా గత నెలలో కురిసిన వర్షాల కారణంగా కొంత మంది విధులకు వెళ్లడం కాస్త ఆలస్యమైంది. ఇంట్లో, ఇతరత్రా కార ణాల వల్ల కొన్ని నిమిషాలు ఆలస్యం అయినా వారికి సైతం కూటమి సర్కారు జీతాల్లో కోత వేసింది. జిల్లాలో దాదాపు 174 మంది ఉద్యోగులకు జీతాల్లో కోత విధించినట్లు సమాచారం. అయితే వైఎస్సా ర్‌సీపీ ప్రభుత్వం వైద్య ఆరోగ్యశాఖకు అధిక ప్రాధాన్యత ఇచ్చింది. ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలనే లక్ష్యంతోనే గ్రామాల్లో విలేజ్ హెల్త్ క్లినిక్‌లను స్థాపించిం ది. ఇక ఆస్పత్రుల నిర్వహణ సక్రమంగా ఉండేలా చర్యలు తీసుకుంది. గత ప్రభుత్వ పాలననే భేష్ అంటూ పలువురు వైద్య ఉద్యోగులు కొనియాడుతున్నారు.

ఉపాధి కల్పనకు నైపుణ్య గణన



మాట్లాడుతున్న జిల్లా అధికారి లక్ష్మీపతి

నిమ్మనపల్లె: ఉపాధి అవకాశాల కల్పనకు నైపుణ్య గణన నిర్వహిస్తున్నట్లు గ్రామ, వార్డు సచి వాలయాల జిల్లా అడ్మినిస్ట్రేషన్ అధికారి లక్ష్మీపతి తెలిపారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో గ్రామ సచివాలయ సిబ్బందికి నైపుణ్య గణన సర్వేపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువతకు అవసరమైన నైపుణ్యాల్లో శిక్షణ ఇచ్చి ఉపాధి అవకాశాలు మెరుగుపరిచేందుకు ప్రభుత్వం ఈ సర్వే చేపడు తోందన్నారు. సచివాలయ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి 15 నుంచి 59 ఏళ్ల మధ్య వయసు ఉన్న ప్రతి ఒక్కరినీ సర్వే చేపట్టి డేటా సేకరించాలన్నారు. సర్వేలో ప్రధానంగా విద్యార్హతలు, సామాజిక, ఆర్థిక స్థితిగతులు, ప్రస్తుత ఉపాధి వివరాలు, నైపుణ్యాలు తదితరాలకు సంబంధించి 25 రకాల ప్రశ్నలకు సమాచారం సేకరించాల్సి ఉంటుంద న్నారు. అలాగే ఆయా వ్యక్తుల విద్యార్హతలు, ఉద్యోగ అనుభవం, ఉద్యోగ ఆసక్తి తదితర వివ రాలు నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎం పీడీఓ పరమేశ్వర్‌రెడ్డి, ఏఓ రమేష్‌బాబు, పం చాయతీ కార్యదర్శులు వెంకటరమణారెడ్డి, మారెప్ప, గౌతమి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఆంజనేయ స్వామి సన్నిధిలో హీరో కిరణ్ అబ్బవరం



వీరాంజనేయస్వామి ఆలయ ఆవరణంలో హీరో కిరణ్ అబ్బవరం

సంబేపల్లె : మండల పరిధిలోని శెట్టిపల్లె పంచాయతీ పాలలబండ శ్రీ వీరాంజనేయ స్వామిని మంగళవారం హీరో కిరణ్ అబ్బవరం దర్శించుకున్నారు. కిరణ్ సొంత గ్రామం మండలంలోని పెద్దకోడివాండ్లపల్లె కావడంతో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి వారికి 108 టెంకాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. 'క' సినిమా హిట్ కావడంతో తల్లిదండ్రులతో కలిసి స్వామి వారిని దర్శించుకున్నానని తెలిపారు. ఇప్పటి వరకు 9 సినిమాలలో తాను నటించానన్నారు. అనంతరం రాయచోటిలో 'క' సినిమా ప్రదర్శిస్తున్న గౌతమ్ థియేటర్ వద్దకు చేరుకున్నారు. అభిమానులు పెద్ద సంఖ్యలో వచ్చి కిరణ్‌కు స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు సందీప్, సుదీప్ తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలతో ముగ్గురాయి కొల్లగొడుతున్నారు



ముడిఖనిజం ఎగుమతి నిలిపేయాలని పనులు అడ్డుకున్న మిల్లు, లారీ యజమానులు

ఓబులవారిపల్లె : మంగంపేట ఏపీఎండీసీ గనులలో బెరైటీస్ ఖనిజం నిల్వల వద్ద కొత్త నిబంధనలతో ఎగుమతి దారులు ముగ్గురాయిని కొల్లగొడుతున్నారని పల్వరైజింగ్ మిల్లులు, లారీల యజమానులు ఆరోపించారు. మంగళవారం వారు గనులలో పనులను అడ్డుకొని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బెరైటీస్ ఖనిజం నిల్వలు ఉన్నచోట ఎగుమతిదారులకు ఒకచోట, చిన్న పార్టీలకు మరోచోట లాట్లను కేటాయించి ఎక్స్‌పోర్ట్ లాట్ల వద్దకు మిషన్లను పోనివ్వకుండా కొత్త నిబంధనను అధికారులు అమలు చేస్తున్నారని విమర్శించారు. ఎగుమతిదారులు లాభపడేలా, మిల్లు యజమానులు నష్టపోయేలా వ్యవహరిస్తున్నారని చెప్పారు. ముడి ఖనిజం ఎగుమతి ఆపివేసి స్థానిక మిల్లులకు న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు. అనంతరం సీపీఓ సుదర్శన్ రెడ్డి, టీడీపీ నాయకుడు ముక్కా సాయి వికాస్ రెడ్డిలు సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో నిరసన విరమించారు. బీజేపీ నాయకుడు, మాజీ ఎంపీపీ గుడిపాటి రాయుడు, పల్వరైజింగ్ మిల్లు యజమానులు పాల్గొన్నారు.

ఎరువుల సొమ్ము మింగేశారు!

- వ్యవసాయ శాఖ, మార్క్‌ఫెడ్ అధికారులు ఉన్నట్టా, లేనట్టా ?
- ప్రభుత్వానికి జమకాని రూ.19 లక్షల ఎరువుల సొమ్ము
- సొంత అవసరాలకు వాడుకున్న పలువురు ఆర్ఎస్‌కే అసిస్టెంట్లు



తుమ్మరకుంట రైతు సేవా కేంద్రం

పెద్దతిప్పసముద్రం : గ్రామీణ ప్రాంత రైతుల ముంగిటకే ఎరువులు, విత్తనాలు అందజేసేందుకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాలను నిర్మించింది. అక్కడ నియమితులైన ఒక అధికారి రైతులకు ప్రభుత్వ సేవలు అందించేవారు. ఈ నేపథ్యంలో రైతు సేవా కేంద్రాల్లో పని చేస్తున్న అసిస్టెంట్లు ఎరువుల సొమ్మును ప్రభుత్వానికి జమ చేయకుండా వారి సొంత అవసరాలకు వాడుకున్నా వ్యవసాయ, మార్క్‌ఫెడ్ అధికారులు ఎందుకు మిన్నకుండిపోయారో అర్థం కావడం లేదు. సర్కార్‌కు జమ కావాల్సిన ఎరువుల సొమ్మును కొందరు ఆర్ఎస్‌కే అసిస్టెంట్ల జేబుల్లోకి వెళ్లి నెలలు గడుస్తున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. అన్నమయ్య జిల్లాలోనే రూ.19 లక్షలకు పైగా ఎరువుల సొమ్ము ఆర్ఎస్‌కే అసిస్టెంట్ల వద్దే ఉన్నా డబ్బులు వసూలు చేయించాల్సిన వ్యవసాయ శాఖ, మార్క్‌ఫెడ్ అధికారులు పట్టీ పట్టనట్లు వ్యవహరిస్తుండటం పలు విమర్శలకు తావిస్తోంది. ఖరీఫ్, రబీ సీజన్‌లలో భాగంగా వివిధ కంపెనీల నుంచి ఇండెంట్ డిమాండ్ మేరకు యూరియా, డీఏపీ, కాంప్లెక్స్‌లు, ఎంఓపీ, ఎస్ఎస్‌పీ తదితర ఎరువులను వ్యవసాయ శాఖ, మార్క్‌ఫెడ్‌ల ద్వారా ఆర్ఎస్‌కేలకు సరఫరా చేస్తుంటారు. వాటిని ఆర్ఎస్‌కే అసిస్టెంట్లు రైతులకు విక్రయించిన తరువాత అదే రోజు, లేదా మరుసటి రోజు ఏపీ మార్క్‌ఫెడ్‌కు జమ చేయాల్సి ఉంది. అయితే పలువురు ఆర్ఎస్‌కే అసిస్టెంట్లు నెలల తరబడి డబ్బు జమ చేయకుండా సొంత అవసరాలకు వాడుకున్నా ఎవరూ పట్టించుకోలేదు. ఈ విషయంపై గట్టిగా ఆదేశాలు ఇవ్వడం లేదా అధిక మొత్తం బకాయి పడిన ఒకరిద్దరిపై క్రమశిక్షణా చర్యలకు ఉపక్రమిస్తే వసూలవుతాయని తెలిసినా అధికారులు ఎందుకు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారని పలువురు చర్చించుకుంటున్నారు.

జిల్లాలో రూ.19 లక్షలకు పైగా జమ కాలేదు

అన్నమయ్య జిల్లాలో 405 రైతు సేవా కేంద్రాలు ఉన్నాయి. ఇందులోనే అత్యధికంగా బి.కొత్తకోట మండలం గుమ్మసముద్రం ఆర్ఎస్‌కే అసిస్టెంట్ రూ.2.79 లక్షలు, ములకలచెరువు మండలం చౌడసముద్రంలో రూ.1.26 లక్షలు, పీటీఎం మండలం తుమ్మరకుంటలో రూ.1.13 లక్షలు పెండింగ్‌లో ఉంది. రూ.20 వేల నుంచి రూ.లక్ష లోపు బకాయిలు ఉన్న ఆర్ఎస్‌కేలు 25 ఉన్నాయి.

ఏడాదిగా ఎరువుల క్రయ విక్రయాలు నిల్

పీటీఎం మండలం తుమ్మరకుంట ఆర్ఎస్‌కేలో గత ఏడాది సెప్టెంబర్ నుంచి ఎలాంటి ఎరువుల విక్రయాలు జరగలేదు. దీంతో రైతులందరూ పక్క ఆర్ఎస్‌కేలకు వెళ్లి ఎరువులు కొనుగోలు చేస్తున్నారు. అయితే ఇక్కడ పని చేస్తున్న ఆర్ఎస్‌కే అసిస్టెంట్ ఎలాంటి బకాయి లేకున్నా రూ.1.13 లక్షల ఎరువుల సొమ్ము పెండింగ్‌లో ఉన్నట్లు ఆన్‌లైన్‌లో ఎందుకు డిస్‌ప్లే అవుతుందో అధికారులకే ఎరుక.

చర్యలు తీసుకుంటాం

ఎరువుల సొమ్ము జమ చేయకుండా నిర్లక్ష్యంగా ఉన్న ఆర్ఎస్‌కే అసిస్టెంట్లకు ఇప్పటికే నోటీసులు కూడా ఇచ్చాం. ఈ విషయంపై తాము కఠినంగా వ్యవహరిస్తున్నాం. మొండి బకాయిల వసూలుకు చర్యలు తీసుకుంటాం. పీటీఎం మండలం తుమ్మరకుంట ఆర్ఎస్‌కే విషయంలో ఉన్న సాంకేతిక లోపాలను సరి చేసి బకాయి లేనట్లు సవరించేలా చొరవ తీసుకుంటాం.

– శివశంకర్, ఏడీఏ, మదనపల్లి.

పవన్ వ్యాఖ్యలు కూటమి ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనం

మాజీ ఎమ్మెల్యే కొరముట్ల



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు

రైల్వేకోడూరు అర్బన్ : డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ హోంశాఖపై చేసిన వ్యాఖ్యలు కూటమి ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు పేర్కొన్నారు. మంగళవారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. హోంశాఖతో పాటు మంత్రి అనితపై ఆయన వ్యాఖ్యలు చేయడం, హోంశాఖ కూడా తానే తీసుకుంటానని చెప్పడం శాంతి భద్రతల వైఫల్యమన్నారు. రాష్ట్రంలో రోజుకొక సంఘటన జరుగుతున్నా ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, హోం మంత్రి అనిత కేవలం ప్రెస్‌మీట్లు, సమీక్షలకే పరిమితమయ్యారని విమర్శించారు. దీనికి తోడు హామీలు అమలు చేయకుండా రాష్ట్రంలో విద్యుత్ చార్జీలు అధికంగా పెంచడం, నిత్యావసర ధరలు అధికమవడం, ప్రతి రోజూ బాలికలపై అత్యాచారాలు పెట్రేగిపోవడం దారుణమన్నారు. అనుభవం కలిగిన పరిపాలన ఇదేనా అని ప్రశ్నించారు. ప్రజలపై ధరల భారం పెంచడమే కాకుండా నాలుగు నెలల్లో దేశంలో రూ. 70 వేల కోట్లు అప్పు చేసిన ఏకైక ప్రభుత్వం ఇదే అన్నారు. ప్రస్తుతం అత్యాచారాలపై హోంశాఖ వైఫల్యాన్ని ఎత్తి చూపిన డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ గత ప్రభుత్వం బాగా పని చేసిందని ఒప్పుకోవడమేనని చెప్పారు. ప్రభుత్వ వైఫల్యాలపై పవన్ జవాబు చెప్పాలని కోరారు. నిత్యం ఇలా ఒకరిపై ఒకరు సంచలన వ్యాఖ్యలు చేసుకొని ప్రభుత్వ వైఫల్యాలను దాచి ప్రజలను తప్పు దోవ పట్టిస్తున్నారని పేర్కొన్నారు.

బైకును ఢీకొన్న కారు

– ఇద్దరికి తీవ్ర గాయాలు

రామాపురం : రామాపురం మండల పరిధిలో జాతీయ రహదారిపై మేదరపల్లె చెక్‌పోస్టు సమీపంలోని రేఖం గార్డెన్ వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. వీరిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు పోలీసులు తెలిపారు. వివరాలు ఇలా.. కడప నుంచి రామాపురం వైపు వెళ్తున్న ఏపీ39 ఎఫ్ 6039 నంబరు గల కారు ముందు వస్తున్న బైకును ఒకవైపు ఢీకొంది. దీంతో బైకుపై వస్తున్న ఇద్దరు కిందపడ్డారు. కారు నిలపకుండా వెళ్తుండడంతో చెక్‌పోస్టు వద్ద గల సిబ్బంది కారును అడ్డుకుని నిలిపేశారు. క్షతగాత్రులలో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. ఇరువురిని చికిత్స నిమిత్తం 108లో కడప రిమ్స్‌కు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. గాయపడిన వారి వివరాలు తెలియాల్సి ఉంది.

పోలీస్ స్టేషన్ ఎదుట యువకుడి ఆత్మహత్యాయత్నం

- భార్య కాపురానికి రాలేదని మనోవేదన
- పోలీసులు పట్టించుకోలేదనే ఆరోపణ
- పోలీసులు చితకబాదడంతో జాతీయ రహదారిపై నిరసన



పోలీస్ స్టేషన్ ఎదుట నిరసన తెలుపుతున్న మణి

గుర్రంకొండ : భార్య కాపురానికి రాలేదనే మనోవేదనతో ఓ యువకుడు పోలీస్ స్టేషన్ ఎదుటే ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన మండల కేంద్రమైన గుర్రంకొండలో జరిగింది. వారం రోజులుగా ఫిర్యాదు చేస్తున్నా పోలీసులు పట్టించుకోవడం లేదని బాధిత యువకుడు ఆరోపించడంతో పోలీసులు చితక బాదారు. దీంతో కడప–బెంగళూరు జాతీయ రహదారిపై బాధితుడు నిరసనకు దిగాడు. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని తరిగొండ పంచాయతీ ఇరగన్నగారిపల్లెకు చెందిన ఆర్. నరసింహులు కుమారుడు ఆర్. మణికి తిరుపతి జిల్లా తలకోన పంచాయతీ ఆవులయ్యగారిపల్లెకు చెందిన రమణ కుమార్తె మానస అనే యువతితో ఐదేళ్ల క్రితం వివాహమైంది. వీరికి ముగ్గురు సంతానం ఉన్నారు. కుటుంబ కలహాల నేపథ్యంలో పదిరోజుల క్రితం మానస పుట్టింటికి అలిగి వెళ్లిపోయింది. తన భార్యను కాపురానికి పంపించాల్సిందిగా అత్తింటివాళ్లను అడిగినా పంపించలేదు. దీంతో వారం రోజుల క్రితం స్థానిక పోలీస్ స్టేషన్‌లో బాధిత యువకుడు ఫిర్యాదు చేశాడు. పోలీసులు రోజు తిప్పుకుంటున్నారే తప్ప తన భార్యను కాపురానికి తీసుకురావడానికి సహకరించడం లేదని బాధిత యువకుడు ఆరోపిస్తున్నాడు. ఈ నేపథ్యంలో మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్‌కు మణి వెళ్లి తాను ఇచ్చిన ఫిర్యాదుపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదంటూ పోలీసులను ప్రశ్నించాడు. పోలీసులకు, మణికి మాటామాట పెరగడంతో పోలీసులు చేయి చేసుకొన్నారని బాధితుడు ఆరోపిస్తున్నాడు. దీంతో పోలీస్ స్టేషన్ ఎదుటే బ్లేడుతో చేయిపై పలు మార్లు కోసుకొంటూ పోలీసులపై నిరసన తెలిపాడు. పోలీసులు స్టేషన్ వద్ద నుంచి పంపించివేయడంతో కడప–బెంగళూరు జాతీయ రహదారిపై పడుకొని నిరసన కొనసాగించాడు. పోలీసులు తనకు న్యాయం చేయలేదంటూ నినాదాలు చేశాడు. మళ్లీ పోలీసులు జోక్యం చేసుకొని వివాదాన్ని పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో నిరసన విరమించాడు.

సినీ నటుడు ప్రకాష్ మృతి



ప్రకాష్ (ఫైల్)

రాజంపేట టౌన్ : యజ్ఞం, వీరభద్ర, పిల్లానీవులేని జీవితం వంటి పలు చిత్రాల్లో నటించిన రాజంపేట మండలం ఇసుకపల్లెకు చెందిన అద్దెపల్లె ప్రకాష్ (48) అనారోగ్యంతో మృతి చెందాడు. ఇటీవల ఊపిరితిత్తుల్లో తలెత్తిన సమస్య వల్ల ప్రకాష్‌ను కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ఓ కార్పొరేట్ హాస్పిటల్‌లో చేర్పించగా అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందినట్లు మృతుని బంధువులు తెలిపారు. ఎంతో సరదాగా ఉండే ప్రకాష్ మృతితో అతని స్నేహితులు దిగ్భ్రాంతికి గురయ్యారు. అలాగే ఇసుకపల్లె గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఇసుకపల్లెలో బుధవారం అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతునికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

నేడు శ్రీ రెడ్డెమ్మ కొండలో వేలం

గుర్రంకొండ : మండలంలోని చెర్లోపల్లె గ్రామంలో వెలసిన శ్రీ రెడ్డెమ్మకొండ ఆలయంలో బుధవారం బహిరంగ వేలం పాటలు నిర్వహించనున్నట్లు ఈఓ మంజుల తెలిపారు. మంగళవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఆలయానికి సంబంధించి టీ, టిఫిన్ హోటల్, పూజాసామగ్రి, టెంకాయలు, పూలదుకాణం, కూల్‌డ్రింక్స్ షాపు, వెహికల్‌పార్కింగ్(టోల్‌గేట్), పాదరక్షలు, భద్రపరచడం, ల్యామినేషన్, బొమ్మల దుకాణం, అమ్మవారి వస్త్రాలు సేకరించుకొనే హక్కుకు వేలం పాట నిర్వహిస్తామని పేర్కొన్నారు. స్థానిక ఆలయ కార్యాలయం వద్ద బుధవారం ఉదయం 11 గంటలకు దేవదాయశాఖ అధికారుల పర్యవేక్షణలో బహిరంగ వేలం పాట నిర్వహిస్తామని తెలిపారు. వేలం పాటల్లో పాల్గొనే వారు ముందుగా రూ. 10,000 ధరావత్తు చెల్లించాల్సి ఉంటుందన్నారు.

ట్రాక్టర్ ఢీకొని మహిళ మృతి



ప్రమాదంలో మృతి చెందిన రామాంజులమ్మ

చిన్నమండెం : మండల పరిధిలోని చిన్నమండెం–పెద్దమండ్యం రహదారిలోని చాంద్‌బాషా మామిడి తోట వద్ద ఎం.రామాంజులమ్మ(57) అనే మహిళ ప్రమాదవశాత్తూ ట్రాక్టర్ ఢీకొని మృతి చెందినట్లు ఎస్ఐ సుధాకర్ తెలిపారు. ఆయన కథనం మేరకు.. పడమటికోన గ్రామ పంచాయతీ నడిగడ్డపల్లెకు చెందిన రామాంజులమ్మ అతని భర్త నాగరాజు మంగళవారం మధ్యాహ్న సమయంలో చిన్నమండెం మండల కేంద్రంలోని పోస్టాఫీసు వద్దకు వచ్చారు. పని ముగించుకుని తిరిగి వెళ్తుండగా చాంద్‌బాషా మామిడి తోట వద్ద ప్రమాదవశాత్తూ ట్రాక్టర్ ఢీకొంది. కింద పడిపోయిన రామాంజులమ్మ పైనుంచి ట్రాక్టర్ వెళ్లడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలికి భర్త, ముగ్గురు ఆడపిల్లలు, ఒక కుమారుడు ఉన్నారు. వారందరికీ వివాహాలు అయ్యాయి. రామాంజులమ్మ మృతదేహాన్ని రాయచోటి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సుధాకర్ తెలిపారు. విషయం తెలుసుకున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి మేనల్లుడు మౌర్యారెడ్డి రాయచోటి ప్రభుత్వాసుపత్రికి చేరుకుని కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

పేదల ఆశలను కూల్చేశారు!

- నకిలీ ఇంటి పట్టాలతో మోసం
- విలపించిన బాధితులు



118 సర్వే నంబరులో పేదల ఇళ్లను జేసీబీతో నేల మట్టం చేస్తున్న రెవెన్యూ సిబ్బంది

కురబలకోట : కురబలకోట మండలం విశ్వం కళాశాల సమీపంలో హైవే పక్కన 118 సర్వే నంబరులో 28 సెంట్ల ప్రభుత్వ స్థలంలో 11 మంది పేదలు నిర్మించుకున్న కట్టడాలను రెవెన్యూ అధికారులు మంగళవారం కూల్చేశారు. ఉదయం ఆరు గంటల నుంచి తొమ్మిది గంటల వరకు భారీ పోలీసు బందోబస్తు మధ్య ఈ కట్టడాలను జేసీబీలతో నేల మట్టం చేశారు. చుట్టూ ట్రెంచీ కొట్టి రెవెన్యూ వారు స్వాధీనం చేసుకున్నారు. ఇది హైవేని ఆనుకుని ఉన్న స్థలం కావడంతో రియల్ ఎస్టేట్ రేటు ప్రకారం దీని విలువ రూ.3 కోట్ల దాకా ఉండవచ్చని భావిస్తున్నారు. జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి అక్రమ కట్టడాల స్థలాన్ని స్వయంగా పరిశీలించారు. మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయ ఇన్‌చార్జి రాఘవేంద్ర స్వయంగా పర్యవేక్షించారు. వారం క్రితమే ఇందులో హెచ్చరిక బోర్డు కూడా రెవెన్యూ అధికారులు ఏర్పాటు చేశారు. ఇంతలోనే పూర్తిగా నేలమట్టం చేయడంతో బాధితులు విలపించారు. శాపనార్థాలు పెట్టారు. నకిలీ ఇంటి పట్టాలు సృష్టించి పేదలకు ఇవ్వడం వల్లే ఆక్రమణగా గుర్తించి తొలగింపునకు కారణమైంది. హైవే పక్కన విలువైన స్థలం కావడంతో ఒక్కో పట్టా రూ.15 లక్షల వరకు కూడా అక్రమార్కులు అమ్మారు. పైగా ఇది రస్తా పొరంబోకు స్థలంగా రెవెన్యూ రికార్డులలో ఉంది. ఇలాంటి స్థలాన్ని ఓ నాయకుడు ఇంటి పట్టాలు ఇప్పిస్తామని నమ్మించాడు. ఓ వీఆర్‌ఓ సహకారంతో నకిలీ పట్టాలు సృష్టించి లబ్ధిదారుల చేతిలో పెట్టారు. ఇవి నిజమైన పట్టాలని నమ్మిన లబ్ధిదారులు అందులో వ్యయ ప్రయాసలకు ఓర్చి ఇళ్లు నిర్మించుకున్నారు. రెవెన్యూ అధికారుల విచారణలో ఇవి నకిలీ పట్టాలని తేలడంతో ఈ క్రమంలో అక్రమ కట్టడాలుగా గుర్తించారు. స్థానిక తహసీల్దారు తపస్విని ఈ విషయమై ఇటీవల జిల్లా కలెక్టర్‌కు నివేదిక పంపారు. దీంతో జిల్లా కలెక్టర్ ఆదేశాలతో మంగళవారం ఉదయం భారీ పోలీసు బందోబస్తు మధ్య వీటిని నిర్దాక్షిణ్యంగా కూల్చేశారు. బాధితులు అడ్డుపడినా పోలీసులు వారిని కనికరం లేకుండా పక్కకు తప్పించారు. 11 మంది కట్టడాలను నేల మట్టం చేయడం వల్ల దాదాపుగా రూ.2 కోట్లకు పైగా బాధితులు నష్టపోయారు. నమ్మించి నకిలీ పట్టాలతో మోసం చేసిన వారిపై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు బాధితులు తెలిపారు. ప్రత్యామ్నాయంగా ఇంటి పట్టాలు ఇచ్చి ఆదుకోవాలని వారు కోరారు. ఈ విషయమై తహసీల్దారు తపస్విని మాట్లాడుతూ ఇక్కడ 11 మంది పేదలకు ఇచ్చిన ఇంటి పట్టాలు నకిలీవిగా విచారణలో తేలిందన్నారు. ఇంటి పట్టాలలో తహసీల్దారు సీలు, రౌండు సీలు అన్నీ నకిలీవిగా గుర్తించామన్నారు. పైగా ఇది రస్తా పొరంబోకు స్థలమన్నారు. దీంతో అక్రమ కట్టడాలుగా గుర్తించి ఉన్నతాధికారుల ఆదేశాలతో తొలగించామన్నారు. పథకం ప్రకారం నకిలీ పట్టాలతో పేదలను మోసం చేశారన్నారు. నకిలీ పట్టాలు సృష్టించిన అక్రమార్కులపై తగు చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు.

ప్రభుత్వ భూముల జోలికొస్తే ఉపేక్షించం

– జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి

కురబలకోట : జిల్లాలో ప్రభుత్వ స్థలాలు, భూముల జోలికొస్తే చట్టపరమైన చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి హెచ్చరించారు. మంగళవారం అంగళ్ల సమీపంలో హైవే పక్కన సర్వే నంబరు 118లో కూల్చి వేసిన అక్రమ కట్టడాల స్థలాన్ని ఆయన స్వయంగా పరిశీలించారు. హైవే పక్కన అదీ ప్రభుత్వ స్థలంలో కట్టడాలు నిర్మిస్తుంటే ఇన్నాళ్లు ఏం చేస్తున్నట్లని స్థానిక రెవెన్యూ వైఖరిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే ఫెన్సింగ్ వేయాలన్నారు.

కేటుగాళ్లు!

- బ్యాంకుల బయట మకాం
- ఖాతాదారులు నగదుతో బయటికి రాగానే ఫాలో
- అదును చూసి పక్కాస్కెచ్‌తో దోపిడీ
- తాజాగా పురపాలికలో డ్రా డబ్బు చోరీ



పురపాలిక కార్యాలయంలో పక్కా స్కెచ్‌తో చోరీకి పాల్పడిన కేటుగాడు

రాజంపేట : మొన్నటి వరకు రాజంపేటలో దొంగలు ఇళ్లకు తాళాలు పగులగొట్టి చోరీలకు పాల్పడుతూ వచ్చారు. పోలీసుల దూకుడుతో దొంగలు కాస్త విరామం ప్రకటించినట్లున్నారు. ఇప్పుడు బ్యాంకుల వద్ద దొంగలు మాటువేసి ఉన్నారు. బ్యాంకుల్లోకి వెళ్లి లావాదేవీలు నిర్వహించినట్లు కనిపిస్తారు. పెద్దమొత్తంలో డబ్బు డ్రా చేసిన వారిని ఫాలో అవుతారు. అదును చూసి పక్కాస్కెచ్‌తో నగదును ఎగురేసుకొని పోతారు. ఇలాంటి వరుస సంఘటనలు రాజంపేటలో జరుగుతుండటంతో నగదుతో బ్యాంకు నుంచి బయటికి రావాలంటే భయపడుతున్నారు. కానీ బ్యాంకర్లు మాత్రం లోపల ఉన్నంతవరకు తాము పర్యవేక్షించగలం కానీ, బయట జరిగితే అందుకు తాము బాధ్యులం కాదని తేల్చి చెబుతున్నారు.

నాడు ఐడీబీఐ బ్యాంకు వద్ద..

అక్టోబరు 2న రాజంపేట పట్టణ ప్రధాన రహదారిలో ఉన్న ఐడీబీఐ వద్ద దొంగలు మాటువేశారు. శ్రీను అనే వ్యక్తి 13 తులాల బంగారు, ఒకటిన్నర లక్ష నగదును కోల్పోయారు. బ్యాంకు నుంచి శ్రీను బయటికి రాగానే స్కూటీని ఫాలో చేశాడు కేటుగాడు. అదును చూసి పక్కా స్కెచ్ ప్రకారం డిక్కీలో ఉన్న నగదు, బంగారును చోరీ చేశాడు.

ఇప్పుడు పురపాలిక సంఘం ఆవరణంలో..

మన్నూరు గ్రామానికి చెందిన కటారు వెంకటసుబ్బారెడ్డి తపాలా కార్యాలయంలో దాచుకున్న రూ.1.20 లక్షల నగదు మంగళవారం డ్రా చేసుకున్నారు. ఆ నగదును తన బైకు సైడు బ్యాగులో దాచుకున్నారు. ఇది గమనించిన కేటగాళ్లు ఆయనను ఫాలో అయ్యారు. పురపాలక సంఘం కార్యాలయానికి వచ్చి, బైకును పక్కన ఉంచి, పన్ను చెల్లించేందుకు లోపలికివెళ్లారు. స్కెచ్ ప్రకారం ఒకరు ఫోన్‌లో మాట్లాడుతూ బైకు వద్ద ఉండటం, మరొకరు బ్యాగ్‌లో డబ్బుతీసేది కనపడకుండా అడ్డంగా నిలబడి అనుకున్నట్లుగా నగదుతో అక్కడి నుంచి ఉడాయించారు.

ప్రైవేటు కెమెరాలే దిక్కు..

రాజంపేటలో పలు సంఘటనలు జరిగినప్పుడు ప్రైవేటుగా ఏర్పాటు చేసుకున్న కెమెరాలే దిక్కయ్యాయనే విమర్శలున్నాయి. పట్టణంలో కొన్ని ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలున్నాయి. కొన్ని కెమెరాలు పనిచేయడం లేదని ఆరోపణలున్నాయి. గతంలో కూడా సీసీ కెమెరాల ఏర్పాటు కోసం పోలీసులు లక్షలాది రూపాయలు వసూలు చేశారు. అప్పట్లో సీసీ కెమెరాల ఏర్పాటు కోసం వసూళ్ల పర్వంలో అనేక ఆరోపణలను పోలీసు శాఖ ఎదుర్కోవాల్సి వచ్చింది. ఇప్పుడు సీసీ కెమెరాలు సరిగ్గా పనిచేయడం లేదన్న విమర్శలున్నాయి.

చీమల దాడితో.. ఆటో డ్రైవర్ పరిస్థితి విషమం



ఆసుపత్రిలో చీమల బాధితుడు

కురబలకోట : ఒక్క చీమ కుట్టిందంటేనే ఒళ్లు చిర చిర మంటుంది.. అలాంటిది మద్యం మత్తులో ఉన్న ఆటో డ్రైవర్‌ను గుంపుగా చీమలు కుట్టడంతో తీవ్ర అస్వస్థతకు గురైన సంఘటన మంగళవారం కురబలకోట మండలంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని ఎర్రమద్దివారిపల్లెకు చెందిన ద్వారకనాథరెడ్డి (29) ఆటోతో జీవనం సాగిస్తున్నాడు. సోమవారం అతిగా మద్యం సేవించి పల్లె దగ్గరున్న కొండకింద నిద్రించాడు. చీమలు అతని శరీరాన్ని చుట్టు ముట్టాయి. అవి కుట్టడంతో తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. గమనించిన స్థానికులు మంగళవారం హుటాహుటిన మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం తిరుపతి రుయాకు తీసుకెళ్లారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ముదివేడు పోలీసులు తెలిపారు.

ఆర్టీసీ డ్రైవర్ ఆత్మహత్య



ఆదినారాయణ (ఫైల్)

బి.కొత్తకోట : భూ సమస్యలు తీరడం లేదని, ఆరోగ్యం సరిగా లేదని చిత్తూరు జిల్లా పుంగనూరు ఆర్టీసీ డిపోలో డ్రైవర్‌గా పనిచేస్తున్న పూల ఆదినారాయణ (49) మంగళవారం ఉదయం చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. ఘటనా స్థలాన్ని సీఐ రాజారెడ్డి పరిశీలించారు. మృతుని కుమారుడు తరుణ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. వివరాలు..బి.కొత్తకోట బాలాజీనగర్‌లో ఉంటున్న ఆదినారాయణ మంగళవారం కుమారుడు తరుణ్‌కు ఫోన్ చేశాడు. కోర్టులో ఉన్న భూములకు సంబంధించిన సమస్యలు తీరలేదని బాధపడ్డాడు. దాయాదులతో భూములపై జరుగుతున్న కేసులు కొలిక్కి రాకపోవడంతో ఇంకా ఎన్ని సమస్యలు పడాలని ఆవేదన చెందాడు. దీనికి తోడు విధులు నిర్వహించేందుకు ఆరోగ్యం సహకరించడం లేదని కొడుకుతో చెప్పాడు. స్వగ్రామం జునపవారిపల్లెకు వెళ్తున్నానని చెప్పి వెళ్లాడు. పల్లెకు సమీపంలోని వారి పొలంలోకి వెళ్లి చింత చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు.

పెన్నా నదిలో బాలుడి గల్లంతు

కడప అర్బన్ : కడప నగరంలోని చిన్నచౌక్ పోలీస్ స్టేషన్ పరిధిలో నివాసముంటున్న మణికంఠ(13) అనే బాలుడు ఈతకొట్టేందుకు స్నేహితులతో కలిసి పెన్నానదికి వెళ్లి గల్లంతయ్యాడు. నీటి ప్రవాహం అధికంగా ఉండడంతో బాలుడు కొట్టుకుపోయి ఉంటాడనే అనుమానంతో పోలీసులు గజ ఈత గాళ్లతో గాలింపు చర్యలు చేపట్టారు.